సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ◆ 7 ◆ జనవరి ◆ 2023



పోలీసులకు ఎస్పీ అభినందన

వృద్ధుడి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్న హైవే మొబైల్ పోలీసులను ఎస్పీ సీహెచ్ విజయారావు శుక్రవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,240
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,113
3 శాతం జీఎస్టీతో	రూ.5,266
సవర (8 గ్రా)	రూ.42,128

గరిష్టం/కనిష్టం
30.0 /23.3

వాతావరణం

శుక్రవారం గాలిలో 68 శాతం తేమ ఉంది. శనివారం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి చలి వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

15న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక గ్రామంలో ఈనెల 15వ తేదీన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా బ్రాహ్మణక్రాక శివాలయం వద్ద పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.45 వేలు, ద్వితీయ రూ.35 వేలు, తృతీయ రూ.25 వేలు, నాలుగు రూ.15 వేలు, ఐదో బహుమతి కింద రూ.10 వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతి ఇస్తామన్నారు. ఆసక్తి గల ఎడ్ల యజమానులు వివరాలకు 99128 70734, 99668 82969 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోర్టులో యూరియా దిగుమతి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా యూరియా దిగుమతి జరుగుతోందని పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా ఎల్ఎంజెడ్ ఫోబ్ అనే నౌక ద్వారా 51 వేల టన్నులు, అలాగే వీ అట్లాస్ అనే నౌక నుంచి 44,644 టన్నుల యూరియా దిగుమతి చేస్తున్నామన్నారు. మరో రెండు నౌకలు యూరియా దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

ఏప్రిల్ 29న నవోదయ ప్రవేశపరీక్ష

నెల్లూరు(టౌన్): మర్రిపాడు మండలంలోని కృష్ణాపురంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశం కోసం ఏప్రిల్ 29వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఐదో తరగతి చదవుతున్న విద్యార్థులు దీనికి అర్హులని, ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పంపాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఇబ్బందులు ఎదురైతే విద్యార్థి స్టడీ సర్టిఫికేట్, ఆధార్, రెసిడెన్స్, ఇతర డాక్యుమెంట్లతో కృష్ణాపురంలోని నవోదయ విద్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. 94935 14644, 94903 77829 ఫోన్ నంబర్లకు కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

3,06,604 మందికి పింఛన్ల పంపిణీ



పొదలకూరులో అచ్చమ్మకు పింఛన్ అందజేస్తున్న వరికుంటపాడు మండలం వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది. 3,14,237 మందికి గానూ శుక్రవారం నాటికి 3,06,604 మంది లబ్ధిదారులకు నగదు అందింది. దీంతో 97.57 శాతం నమోదైంది. వారోత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. వారంరోజుల నుంచి నియోజకవర్గ, మండల కేంద్రాలు, గ్రామాల్లో కొత్త పింఛన్లను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు.


హెచ్‌ఎంలకు ముగిసిన శిక్షణ



శిక్షణకు హాజరైన వారితో అధికారులు

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండురోజులుగా నెల్లూరులోని గోమతినగర్‌లో ఉన్న నారాయణ గోమతి స్కూల్లో జరుగుతున్న శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు ఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు హాజరైన ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి నూతన విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు కుముద, డిప్యూటీ డీఈఓ భిక్షాలు, ఏఎంఓ సుధీర్‌బాబు, ఆర్పీలు రాధారాణి, పార్వతి, కామేశ్వరి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు చూస్తున్నాయ్!



కేవీఆర్ సర్కిల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

అత్యాధునిక సీసీ కెమెరా

➡ జిల్లాలో పదకొండువేలకు పైగా సీసీ కెమెరాలు

- గత మూడునెలల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా 1,387 సీసీ కెమెరాల ఏర్పాటు
- కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షణ
- నేరస్తులను పట్టుకోవడంలో కీలకపాత్ర
- సంచలన కేసులను ఛేదించిన వైనం

➡ 'తమిళనాడుకు చెందిన డేనియల్, పొదర్తి వెంకటేశ్వర్లు వివిధ కేసుల్లో జైలుకి వెళ్లగా అక్కడ స్నేహితులుగా మారారు. బయటకు వచ్చాక తీరు మార్చకోకుండా జల్సాలకు అలవాటుపడి మోటార్‌బైక్‌లో వెళ్తూ చైన్‌స్నాచింగ్ చేయడం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వారిపై 14 కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల కోవూరు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది కలిసి సీసీ కెమెరాల ఆధారంగా వారిని గుర్తించి వలవేసి పట్టుకున్నారు. రూ.25 లక్షల విలువైన 532 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు'

➡ 'నెల్లూరు నగరంలో ఇటీవల రెండేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ల పరిధిలో సీసీ ఫుటేజీని పరిశీలించారు. కిడ్నాపర్ చిన్నారిని తీసుకుని ఆత్మకూరు బస్టాండ్ నుంచి కడప వైపు వెళ్లే బస్సు ఎక్కాడని, సంగంలో ఓ మహిళకు అప్పగించినట్లు గుర్తించారు. నిందితులను పట్టుకుని చిన్నారిని తల్లిదండ్రులకు వద్దకు క్షేమంగా చేర్చారు.

ఇంకా జిల్లాలో సంచలనం రేపిన కోర్టులో ఫైల్ల కేసులో నిందితులను పట్టుకోవడం, నగరంలోని హరిత హోటల్ వద్ద హత్య కేసును ఛేదించడంలో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడ్డాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. జిల్లావ్యాప్తంగా ప్రతి రహదారిని నిఘా నేత్రాల ద్వారా పోలీసులు చూస్తున్నారు. వాటిని ఏర్పాటు చేయించడంలో ఎస్పీ విజయారావు ప్రత్యేక చొరవ చూపి జిల్లాను నిఘా కనుసన్నల్లో ఉంచి పర్యవేక్షణ చేస్తున్నారు. ఫలితంగా మిస్టరీ కేసుల్లో చిక్కుముడులు వీడుతున్నాయి. కెమెరాల కారణంగా నేరాల సంఖ్య తగ్గుతోంది. నేరస్తుల్లో భయం ఏర్పడింది. ఎక్కడ చిన్న తప్పు చేసినా తప్పించుకోలేమన్న భావనను పోలీసులు కలిగిస్తున్నారు.

ఎన్ని.. ఎక్కడ?

జిల్లా వ్యాప్తంగా గతంలో 10,126 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఎస్పీ విజయారావు ప్రత్యేక డ్రైవ్ చేయించి అదనంగా 1,387 సీసీ కెమెరాలను స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సాయంతో పెట్టించారు. దీంతో 11,513 కెమెరాలు పనిచేస్తున్నాయి. ఇప్పటికే నగరంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కృష్ణపట్నం పోర్టు పరిసరాలు, పరిశ్రమల వద్ద, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, దర్గాలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, షాపింగ్‌మాల్స్‌లో అమర్చారు. మేజర్, మైనర్ పంచాయతీల్లో కూడా ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.

ముఖ్యమైన ప్రాంతాల్లో..

నెల్లూరు నగరంలో..	6,130
నెల్లూరు రూరల్లో..	1,041
కావలిలో	1,885
ఆత్మకూరులో..	836

24 గంటలూ విధుల్లో..



ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంలో పరిశీలిస్తున్న సిబ్బంది

నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ 24 గంటలూ పనిచేస్తుంది. సీసీ కెమెరాల దృశ్యాలను వీక్షించేందుకు భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ డయల్ 100, ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాల పర్యవేక్షణ జరుగుతుంది. పదిమంది పోలీసులు మూడు షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతం నుంచి వచ్చే ఫిర్యాదులను ఇక్కడి నుంచే పరిశీలించి పరిష్కరిస్తుంటారు. ప్రభుత్వం మ్యాట్రిక్స్ ద్వారా ఏర్పాటు చేసిన 347 కెమెరాలు, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన 213 కెమెరాలను అనుసంధానం చేసి పర్యవేక్షణ చేస్తుంటారు.

నేరాలకు కళ్లెం



జిల్లాను సీసీ కెమెరాల నిఘాలోకి తెచ్చాం. ఎక్కడ ఏ ఘటన జరిగినా ఫుటేజీ తీసుకుని వెంటనే వాస్తవాలు గ్రహించి చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఉన్న కెమెరాల కంటే స్పెషల్ డ్రైవ్ పెట్టి అదనంగా పెట్టించాం. పలు కేసులను కెమెరాల ఫుటేజీల ద్వారా ఛేదించగలిగాం. పోలీస్ కంట్రోల్‌రూంలో మా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అత్యాధునిక కెమెరాలు ఏర్పాటు చేయడంతో వంద మీటర్లలో గుండు సూది పడినా కన్పించే పరిస్థితి ఉంది. నిఘా నేత్రాలతో నేరాలకు కళ్లెం పడే అవకాశం ఉంది.

– సీహెచ్ విజయారావు, ఎస్పీ

వీటి వల్ల..



కంట్రోల్ రూం నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది సూచనలు

సీసీ కెమెరాలు నేరస్తులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఎక్కడైనా మిస్సింగ్ కేసులు నమోదైనా, కిడ్నాప్ కేసుల్లో నిందితులను గుర్తించడానికి వాటి ఫుటేజీలే ఆధారమవుతాయి. దొంగతనాలు జరిగినప్పుడు కూడా పరిసర ప్రాంతాలలో ఫుటేజీ కీలకమవుతుంది. చైన్ స్నాచింగ్‌లు, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో కూడా ఎవరిది తప్పు అనేది తెలుసుకోవడంలో ఉపయోగపడుతున్నాయి. పెద్ద ఉత్సవాలు, జాతరలు జరిగే సమయాల్లో నిఘా కెమెరాల ద్వారానే పర్యవేక్షణ జరుగుతోంది. ఇటీవల నగరంలో జరిగిన కీలక కేసుల్లో సీసీ కెమెరాల నుంచి తీసుకున్న ఫుటేజీల ఆధారంగానే నిందితులను పట్టుకున్నారు.

అందరి చూపు నెల్లూరు వైపే..

- జిల్లా రవాణా శాఖలో ఆర్టీఓ, ఎంవీఐకు పోస్టింగ్
- ఇక్కడ ఖాళీ ఏర్పడితే వచ్చేందుకు అనేకమంది ఆసక్తి



సుధాకర్‌రెడ్డి



గోపీనాయక్

నెల్లూరు(టౌన్): జిల్లా రవాణా శాఖలో పోస్టింగ్‌కు మంచి డిమాండ్ ఉంది. రెండు సంవత్సరాలు పనిచేస్తే జీవితంలో స్థిరపడిపోవచ్చనే భావన ఆ శాఖలోని కొంతమందిలో ఉంది. దీంతో ఇక్కడ పోస్టింగ్ కోసం ఎక్కువమంది పోటీ పడుతున్నారు. ఈకోవలోనే ఓ ఆర్టీఓ, ఎంవీఐ పోస్టింగ్ తెచ్చుకున్నారు. గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎంవీఐగా పనిచేసిన సుధాకర్‌రెడ్డి పదోన్నతిపై ఆర్టీఓగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. అక్కడి నుంచి డిప్యుటేషన్‌పై అనంతపురం వెళ్లారు. గత ఏడాది జూలై నెలలో జరిగిన బదిలీల్లో డిప్యుటేషన్లను రద్దు చేశారు. దీంతో ఆయన మళ్లీ విశాఖపట్నం వెళ్లారు. బదిలీలు ముగిసిన అనంతరం డిప్యుటేషన్‌పై నెల్లూరు ఆర్టీఓగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. అయితే డిప్యుటేషన్లు, బదిలీల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు రావడంతో ఆ సమయంలో ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పనిచేస్తున్న రాజబాబును బదిలీ చేసి సీతారామాంజనేయులుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయన వచ్చిన వెంటనే డిప్యుటేషన్లలో ఉన్న ఆర్టీఓలు, ఎంవీఐలు, ఏఎంవీఐలు తిరిగి యథాస్థానానికి వెళ్లాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సుధాకర్‌రెడ్డి వైజాగ్‌లో చేరి లాంగ్ లీవ్ పెట్టారు. 97 రోజుల అనంతరం మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను పెట్టడంతో ఆయనకు కావలి ఆర్టీఓగా పోస్టింగ్ కల్పించారు. శుక్రవారం ఆయన నెల్లూరులో ఉప రవాణా కమిషనర్ బి.చందర్‌ను కలిసి జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు.

ఎంవీఐగా గోపీనాయక్

నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవీఐగా గోపీనాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2021లో సూళ్లూరుపేటలో ఎంవీఐగా పనిచేస్తున్న సమయంలో అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్ తదితర రాష్ట్రాలకు చెందిన 83 ట్యాంకర్లకు ఎలాంటి ఫిజికల్ ఫిట్‌నెస్ చేయకుండానే రీ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపణలున్నాయి. ఆ సమయంలో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయని ప్రచారం జరగడంతో ఈ ఘటనపై రవాణా శాఖ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపారు. ఇందులో వాస్తవాలు బయటపడడంతో ఆయనపై 2021 డిసెంబర్‌లో సస్పెన్షన్ వేటు పడింది.

సంక్రాంతికి 108 ప్రత్యేక బస్సులు

- సాధారణ చార్జీలతోనే ప్రయాణించే అవకాశం
- జిల్లా ప్రజా రవాణాధికారి పీవీ శేషయ్య



నెల్లూరు(క్రైమ్): సంక్రాంతి పండగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల కోసం సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణాధికారి పీవీ శేషయ్య తెలిపారు. నెల్లూరులోని ప్రధాన బస్టాండ్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండగ దృష్ట్యా జిల్లాకు వచ్చే వారి కోసం 108 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటుచేసి వాటి నంబర్లను ఆన్‌లైన్‌లో ఉంచి ఇప్పటికే రిజర్వేషన్లు ప్రారంభించామన్నారు. 90 బస్సుల్లో రిజర్వేషన్ పూర్తయిందన్నారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 58, బెంగళూరు నుంచి 23, చెన్నై నుంచి 9, విశాఖపట్నం నుంచి 6, కాకినాడ నుంచి 1, కర్నూలు నుంచి 4, విజయవాడ నుంచి ఏడు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం సర్వీసులు ప్రారంభమయ్యాయని, ఈనెల 14వ తేదీ వరకు నడుపుతామన్నారు. రావడానికి, తిరుగు ప్రయాణానికి ఒకేసారి టికెట్ తీసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. సీనియర్ సిటిజన్ల 25 శాతం రాయితీ ఉందని, పండగ రోజుల్లోనూ ఇది వర్తిస్తుందన్నారు. రద్దీని బట్టి అదనపు బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో అధిక చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేకుండా సాధారణ చార్జీలతో సురక్షిత ప్రయాణం సాగించవచ్చని తెలిపారు.

గ్రూప్–1 పరీక్షకు 16 కేంద్రాల ఏర్పాటు

- అభ్యర్థులు గంట ముందుగా హాజరుకావాలి
- ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు
- ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వసంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వసంత్‌కుమార్, చిత్రంలో బాపిరెడ్డి తదితరులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జిల్లాలో గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణకు 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ వసంతకుమార్ తెలిపారు. పరీక్ష నిర్వహణపై నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో శుక్రవారం లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్‌కుమార్, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు కేంద్రాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. పరీక్షకు 6,045 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వారి కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం పెడుతున్నామన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. వాటి సమీపంలో జెరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర సామగ్రి జిల్లాకు చేరిందని, పోలీసు బందోబస్తు నడుమ భద్రపరిచామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు కేంద్రంలోని కింది అంతస్తులో పరీక్ష నిర్వహించాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. కేంద్రాల్లో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాస్కులు, శానిటైజర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా తాగునీరు, ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. పేపర్–1 ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌తోపాటు, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసర్ ధిల్లేశ్వరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

గ్రూప్–1 స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తహసీల్దార్ (మెజిస్టీరియల్) రాఘవేంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలు, ఇతర సమాచారం కోసం 0861–2331477 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.


రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ఈవ్‌టీజింగ్, నేర నియంత్రణ చర్యల్లో భాగంగా శుక్రవారం నెల్లూరు సౌత్, వేదాయపాళెం రైల్వేస్టేషన్లలో నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్. హరిచందన తన సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలువురు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫిన్స్ పరికరం ద్వారా అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించి డేటాబేస్‌తో పోల్చి చూశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుంతకల్ రైల్వే ఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాల మేరకు నెల్లూరు రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు పర్యవేక్షణలో నెల్లూరు ప్రధాన, సౌత్, వేదాయపాళెం రైల్వేస్టేషన్లలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచామన్నారు. ఫిన్స్ పరికరం ద్వారా ఇప్పటికే పలువురు పాతనేరస్తులను గుర్తించి జైలుకు పంపామన్నారు. ప్రయాణికులు అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండరాలను తినరాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే రైల్వే పోలీసులకు, ఆర్‌పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండనుండడంతో నేరాలు జరగకుండా నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామన్నారు.



స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్సై, సిబ్బంది

సోమశిలలో 71.924 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం నాటికి 71.924 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 4,140 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 300, కండలేరుకు 1300 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 99.750 మీటర్ల నీటి మట్టం ఉంది.

క్లుప్తంగా

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు



జగనన్న కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్

ఆత్మకూరు: దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ సుబ్బరాజు తెలిపారు. ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. నెల్లూరుపాళెం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌తోపాటు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో జరుగుతున్న విద్యుత్‌లైన్ల ఏర్పాట్లను చూశారు. అనంతరం డీఈ కార్యాలయంలో శాఖాపరమైన అభివృద్ధి పనులు, విద్యుత్ బకాయిల వసూళ్ల గురించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తుండడంతోపాటు రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో విద్యుత్ బకాయిల వసూళ్లకు పలు సూచనలు చేశారు. లక్ష్యాలను నిర్దేశించుకుని బకాయిలు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ బి.జనార్దన్, ఏడీ బి.సురేష్, ఏఈ నరసింహారావు, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు రాగిజావ



పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు (ఫైల్)



- సర్వేపల్లి నియోజకవర్గంలో మూడునెలలుగా అమలు
- సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి కాకాణి

పొదలకూరు: 'జగనన్న గోరుముద్ద'లో రాగిజావను చేర్చి సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో గత మూడు నెలలుగా పొదలకూరు, ముత్తుకూరు, మనుబోలు, వెంకటాచలం, టీపీ గూడూరు మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిమాల్ట్‌ను అందిస్తున్నారు. ఇందుకోసం సాయిష్యూర్ కంపెనీ నుంచి ప్రతి పాఠశాలకు రాగిపిండి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. విద్యార్థులు బలంగా ఉండడంతోపాటు చదువుపై శ్రద్ధ పెంపొందేందుకు పౌష్టికాహారం దోహదపడుతుందనే ఉద్దేశంతో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పాఠశాలల్లో హెచ్‌ఎంలు రోజు విడిచి రోజు ఒకరోజు రాగిజావలో బెల్లం కలుపుతూ, మరొక రోజు సాల్ట్ వేసి విద్యార్థులకు అందిస్తున్నారు.



రాగిజావ రుచి చూస్తున్న ఆర్‌జేడీ సుబ్బారావు (ఫైల్)

సర్వేపల్లిలో అమలు ఇలా..

సర్వేపల్లి నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న మొత్తం 373 పాఠశాలల్లో మంత్రి కాకాణి ప్రోత్సాహంతో విద్యార్థులకు రాగిజావను అందజేస్తున్నారు. ఇందుకోసం మంత్రి కాకాణి తన సొంత నిధులను వెచ్చిస్తున్నారు. పొదలకూరు మండలంలో 103 పాఠశాలలు, ముత్తుకూరు మండలంలో 71, టీపీ గూడూరు మండలంలో 68, వెంకటాచలం మండలంలో 78, మనుబోలు మండలంలో 53 పాఠశాలలకు రాగిమాల్ట్‌ను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. గుంటూరు ఆర్‌జేడీ సుబ్బారావు సైతం పొదలకూరు జెడ్పీ హైస్కూల్లో రాగిజావను తాగి ఈ కార్యక్రమం అమలుపై అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రి దృష్టికి..

సర్వేపల్లి నియోజకవర్గంలో విద్యార్థులకు రాగిజావ అందజేసే కార్యక్రమం విజయవంతం కావడంతోపాటు పిల్లలకు తృణధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందుతుండడంతో మంత్రి కాకాణి ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి జగనన్న గోరుముద్ద పథకంలో అదనంగా రాగిజావను చేర్చుతూ ఆదేశాలను జారీ చేశారు. వారానికి రెండు పర్యాయాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రాగిమాల్ట్‌ను అందజేస్తామని సీఎం ప్రకటించారు. విద్యార్థుల పౌష్టికాహారం అందించడంపై వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	125	బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	242
లేయర్ (లైవ్) :	85	లేయర్ చికెన్ :	145
బ్రాయిలర్ చికెన్ :	218		

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.17
సన్నవి: రూ.10
పండ్లు: రూ.4

హైవే మొబైల్ పోలీసులకు ఎస్పీ అభినందన



హైవే మొబైల్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడి ప్రాణాలు కాపాడి మానవత్వం చాటుకున్న హైవే మొబైల్ పోలీసులను ఎస్పీ సీహెచ్ విజయారావు శుక్రవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వరపురానికి చెందిన యానాదయ్య అనే వృద్ధుడు అలిగి ఇటీవల ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం ఆయన కొడవలూరు మండలం రాజుపాళెం సమీపంలోని పొలాల్లోని బురదలో అపస్మారకస్థితిలో పడిపోయి ఉండడాన్ని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హైవే మొబైల్ సిబ్బంది వెంకటప్రసాద్, సుధాకర్ చూశారు. వారు వెంటనే స్పందించి యానాదయ్యను బురదలో నుంచి బయటకు తీసి స్నానం చేయించి దుస్తులు వేశారు. అనంతరం కోవూరు వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. వృద్ధుడి ద్వారా అతడి కుటుంబసభ్యుల వివరాలు సేకరించి వారికి అప్పగించారు. దీంతో వృద్ధుడి కుటుంబసభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది చర్యలను ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ జి.శ్రీనివాసరావు, ఎంటీఓ పాల్‌రాజు పాల్గొన్నారు.

నకిలీ అధికారి హల్‌చల్

ఆత్మకూరు: దుకాణాలు పండగ కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటే ఓ వ్యక్తి సేల్స్ టాక్స్ అధికారినంటూ హల్‌చల్ చేసిన ఘటన ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వ్యాపారస్తుల సంఘం యూనియన్ నాయకులు, దుకాణదారుల వివరాల మేరకు.. ఓ వ్యక్తి పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద నాగేశ్వరరావు హోల్‌సేల్ దుకాణానికి వెళ్లి తాను సేల్స్ టాక్స్ ఆఫీసర్‌నంటూ వస్తువుల గురించి ఆరాతీశాడు. కుర్‌కురే ప్యాకెట్ల పార్శిల్ పెట్టెలను చూసి వాటికి బిల్లులేవని అడిగాడు. దుకాణదారుడు సమాధానం చెప్పేలోపే బిల్లుల్లేకుండా తెచ్చారని రూ.10 వేల జరిమానా కట్టాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆ దుకాణదారుడు తమ యూనియన్ నాయకులతో మాట్లాడి చెబుతానన్నాడు. ఈలోపు సదరు నకిలీ అధికారి అక్కడి నుంచి ఉడాయించాడు. అనంతరం సమీపంలోని కాలనీలో, అప్పారావుపాళెంలో చిన్న దుకాణాల వద్ద విక్రయించే వస్తువులను చూసి వీటికి బిల్లులేవని దబాయించాడు. వాటిని ఆత్మకూరులోని శరవణ హోల్‌సేల్ షాపులో కొనుగోలు చేశామని వారితోనే మాట్లాడాలని ఫోన్ కాల్ చేసిచ్చారు. బిల్లుల్లేకుండా ఇవ్వడంతో ఒక్కో బాక్స్‌కు రూ.600 ఫైన్ కట్టాలన్నాడు. దీంతో ఫోన్‌లో నకిలీ అధికారితో మాట్లాడుతున్న శరవణ హోల్‌సేల్ దుకాణదారుడు తమ వద్దకు రావాలని బిల్లులు చూడడంతోపాటు యూనియన్ నాయకులతో కూడా మాట్లాడొచ్చన్నాడు. దీంతో నకిలీ అధికారి ఏవో మాటలు చెప్పి జారుకున్నాడు. అతను పట్టణంలోని పలు ప్రాంతాల్లో నగదు వసూలు చేశాడని యూనియన్ వారికి సమాచారం అందింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

గృహ నిర్బంధంలో మతిస్థిమితం లేని మహిళ



తేజావతిని విచారిస్తున్న సీఐ కోటేశ్వరరావు

- తలుపులు పగులగొట్టి బయటకు తీసుకొచ్చిన పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం: మతిస్థిమితం లేని తేజావతి అనే 25 సంవత్సరాల మహిళను బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరుకు చెందిన జి.లంకేశ్వరరావు రెండునెలలుగా తన గృహంలో నిర్బంధించిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. సీఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. ఆత్మకూరు గ్రామానికి చెందిన తేజావతి కొడవలూరు మండలం యల్లాయపాళెం పీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించేది. ఆమెకు మతిస్థిమితం లేని కారణంగా రెండునెలలుగా బుచ్చిరెడ్డిపాళెంలోని పెద్దూరుకు చెందిన లంకేశ్వరరావు తన ఇంట్లో నిర్బంధించాడు. సమోసాలు విక్రయించే అతను బయటకు వెళ్లే సమయంలో తేజావతిని ఇంట్లోనే ఉంచి తలుపులు వేసి తాళం పెట్టేవాడు. తిరిగి రాత్రి వేళల్లో ఇంటికి వచ్చినప్పుడు ఆ ఇంట్లో నుంచి పెద్దగా మహిళ అరుపులు వినిపించేవి. దీంతో స్థానికులు ఐసీడీఎస్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వీరప్రతాప్ ఇంటి తలుపులు పగలగొట్టి మతిస్థిమితం లేని మహిళను బయటకు తీసుకొచ్చారు. బాధితురాలిని నెల్లూరులోని సఖి వన్ స్టాప్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే లంకేశ్వరరావు మాత్రం తన ఇంటి సమీపంలో ఉన్న తేజావతిని గుర్తించి అన్నం పెట్టి చేరదీశానని, ఆమె ఎవరో, ఎక్కడ నుంచి వచ్చిందో చెప్పలేకపోవడంతో తాను కూడా ఎవరికీ సమాచారం ఇవ్వలేదని తెలిపినట్లు సీఐ వెల్లడించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సీపీయూ దొరికిందా?

సీతారామపురం: మండలంలోని బాలాయపల్లి సచివాలయం వద్ద కంప్యూటర్ సీపీయూ కనిపించింది. తహసీల్దార్ కార్యాలయంలో వారంరోజుల క్రితం చోరీకి గురైన సీపీయూ అదేనని ప్రచారం జరుగుతోంది. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం పంచాయతీలోని సర్వే నంబర్ ఒకటిలోని మేత పోరంబోకు భూమిలో 47 ఎకరాలు స్వాహాకు గురైందని అలజడి రేగడం, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సీపీయూ చోరీకి గురి కావడాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో ఉదయగిరి సీఐ గిరిబాబు విచారణ వేగవంతం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని బాలాయపల్లి సచివాలయం వద్ద ఆరుబయట సీపీయూ కనిపించింది. దీనిని గుర్తించిన సచివాలయ సిబ్బంది పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి వెళ్లి సీపీయూను నెల్లూరుకు తరలించారు. అది రెవెన్యూ కార్యాలయానికి సంబంధించిందా? లేక వేరే వాళ్లదా అని తేలాల్సి ఉంది. భూముల స్వాహాకు సంబంధించి విచారణను ఆలస్యం చేసేందుకే ఆక్రమణదారులు పథకం ప్రకారం వేరే సీపీయూ పెట్టారా అనే విషయాలు విచారణలో వెలుగులోకి రానున్నాయి. ఈ విషయం మండలంలో చర్చనీయాంశమైంది.